

# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

## (గత సంచిక తరువాయి)

**ఆగంతకుడికి పిచ్చి వాడిలా** నవ్వాలనిపించింది. జరుగుతున్న ప్రహసనమంతా గమనించిన తరువాత ఒక విషయం గుర్తుకొచ్చి. విరగబడి నవ్వాడు. అనంతానికి వెన్ను చల్లబడింది. శారీరకంగా అనంతంలో సగమే ఉన్నాడు అతను, నిజమే. పిచ్చివాడి బలాన్ని అంచనా వేయలేము. ఏ క్షణాన దేనికి పూనుకుంటాడో చెప్పలేము. ఉన్నట్టుండి తనను పిట్ట గోడ మీదినుంచి వెనక్కు తోసెయ్యవచ్చు అదాటుగా ఉంటే. తన చెయ్యి లాక్కుని కొరికెయ్యవచ్చు. ఆరోగ్యకరంగా ఉన్నా మనసున్న మనిషినే నమ్మలేనప్పుడు, ఎదుర్కొనడం కష్టమైనపుడు, ఒక ఉన్మాదిని ఎలా ఎదుర్కోవడం?

"నాది పిచ్చి నవ్వులా తోచింది కదా, అన్నయ్యా? పిచ్చిపట్టినా నాకు ఎవరైనా అపకారం చెయ్యగలరు కానీ, నేను ఎవరికీ చెయ్యలేను. పళ్ళున్నా, గోళ్ళున్నా నేను పరమ సాధు జంతువును; ఆవుకు కనీసం కొమ్ములుంటాయి. మరొకరికి నేను అపకారం చేయడానికి పిచ్చి కూడా నాకు అవకాశం ఇవ్వదు. మీరు ఏమనుకోకపోతే ఒక మాట అంటాను. అందం ఎంతటిదైనా సరే, కించిత్ ధైర్యాన్ని మనకు ఇవ్వలేదు; దానికి ఆ శక్తి లేదు."

"ప్రాతిదానికీ సిద్ధాంతీకరణేనా? ఇంతకూ ఎందుకు నవ్వావో చెప్పు. నేనేమీ భయపడి చావలేదులే. భయం వలన ఆగిపోయ్యేంత బలహీనమైనది కూడా కాదు నా గుండె," అవమానం జరిగినట్టు అన్నాడు అనంతం.

"కోపగించకుండా ఉండాలనే కదండీ 'మీరు ఏమీ అనుకోకపోతే' అని జోడించింది. సరే నవ్వుకు కారణం ఇది: ఇద్దరు చిలిపివాళ్లు దేముడిని తేలిక చేసి మాట్లాడారు. ఒక వేళ దేముదున్నా తమను శిక్షించడన్నా ధీమానో, దేముడంటే లోకువో. దేముడుండుంటే దేముడిని సృష్టించింది ఎవరు అని ప్రశ్నించారు. దేముడు సర్వ శక్తిమంతుడు (omnipotent) అయుంటే తాను మోయలేనంత రాయిని సృష్టించగలడా అని అడిగారు. దాంట్లోని పారడాక్స్ నీకు

చెప్పక్కరలేదు కానీ చెబుతాను. 'ఎత్తలేని తనం వలన' అలాంటి రాయిని సృష్టిస్తే సర్వ శక్తిమంతుడు అనడం సాధ్యం కాదు; అలాంటి రాయిని సృష్టించలేక పోయినా ఆయన అనంతమైన శక్తి ప్రశ్నించబడుతుంది."

"అయితే ఆ పారడాక్స్ సవాలుకు సమాధానం లేనట్లే కదా?."

"అద్వైతంలో ఉంది; జగత్తే మిథ్య అయినపుడు దేముడు సృష్టించడం లేనే లేదు. ఈ ప్రపంచం రజ్జు సర్ప భ్రాంతే కదా? పైగా జగత్తు వేరు, సృష్టికర్త వేరూ కాదు. రెండూ వేరు వేరైనప్పుడు మాత్రమే అలాంటి రాయిగురించిన ప్రశ్న అడిగే వీలుంటుంది. సర్వ శక్తిమంతుడు, సర్వజ్ఞుడు అయినా బ్రహ్మ ఆ సవాలును స్వీకరించకూడదు కూడా. అలా స్వీకరిస్తే బ్రహ్మత్వం దెబ్బతింటుంది. అలా తన శక్తిని నిరూపించుకునే పనికి దేవుడు పూనుకోవడం లేదు. తన ఉనికిని అందరూ నమ్మాలని భావిస్తాడని అనుకోను – ఒక వేళ ఆయన ఉంటె. నమ్మని వాడిని శిక్షించడు – అలా నమ్మకపోవడంవలన తనకేమి నష్టం లేదు కనుక; నిజానికి లాభనష్టాల గురించి ఆలోచిస్తే బ్రహ్మ కాదుకదా. అవసరమేలేని ఏదైనా సమాధానం ఇవ్వగలడేమో. ఇక దేముడిని ఎవరు సృష్టించారు అన్న ప్రశ్నకొస్తే, ఎవరూ సృష్టించలేదని మన తత్త్వ గ్రంథాలు చెప్పగలవు. ఆదీ అంతం అనేవి లేనపుడు మరొకరెవరో సృష్టించడం ఉండదు."

"ఇంతకూ ఆది అంతాలు లేవని ఎవరు చెప్పగలరు?"

"ఆది శంకరాచార్యను అడిగితె ఉపని షత్తులు చెప్పాయి; వాటిని ప్రశ్నించే ప్రశ్న ఉదయించకూడదన్నాడు."

"పరబ్రహ్మను మహాసముద్రంగా పోల్చడం సరైనదే అనుకుంటే, ఆత్మలుగా మనం కెరటాలం. కెరటం సముద్రపు ఉనికిని ప్రశ్నించడం హాస్యాస్పదం. దేనికైనా నమ్మకం కావాలి. నమ్మకానికి కారణాలు చూపాలి. కానీ ప్రతి దానికీ కారణం దొరకదు. కారణాలు దొరకనంత మాత్రాన ఏదైనా సత్యం సత్యం కాకుండా పోదు. ఎవరో అన్నారు రీసన్ ఈజ్ ఏ స్కాండ్రల్ అని. దానర్థం కారణమూ నమ్మదగినది కాదనేమో."

అనంతానికి రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తూ ఉండిపోయాడతను. పిచ్చివాడిలా నవ్వడం ఈ సారి అనంతం వంతు అయింది. ఆగంతకుడు భయపడలేదు. అనాకారితనం ధైర్యం ఇస్తుందని అనుకోలేదు అతను.

"హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేస్తున్నానా?"

"లేదు. నీలాంటి మర్కటం ముందే వేస్తున్నావు."

"నిజానికి మర్కటాన్ని సృష్టించడంలో తన సెన్స్ అఫ్ హ్యూమర్ చూపుకున్నాడు దేముడు."

దేముడు, కర్మల గురించి శంకరుడు భాష్యం చెప్పిన బ్రహ్మ సూత్రాలు ఏమున్నాయో చెప్పుకుని ఈ చింతనకు కూడా చరమ గీతం పాడుతాను. మనం––అంటే మన శరీరాలు కావు – ఆత్మలు; అవే పునర్జన్మలు ఎత్తుతుంటాయి; అవే పనులు చేయిస్తాయి, వాటి ఫలితాలను అనుభవిస్తాయి. అవే జన్మ బంధం నుంచి విముక్తికి ప్రయత్నిస్తాయి. దృశ్యమానమైన ప్రపంచం బ్రహ్మలో కనిపిస్తుంది, బ్రహ్మలోనే మాయమవుతుంది. సృష్టి అన్న మాట వాడటం తప్పు ఎందుకంటే దానికి ఆది అంతమూ లేవు కాబట్టి. దేవుడికంటూ ఏ లబ్ధిని చేకూర్చే కారణం లేకుండానే. ఊపిరి పీల్చడం

ఒదిలెయ్యడం వాటంతట అవి జరిగిపోతుంటాయి. సృష్టి అంతే. దేముడికి ఏదైనా కారణాన్ని అంటకట్టడానికి వేదాలూ ఒప్పుకోవు, తర్కమూ అంగీకరించదు. ఈ ప్రపంచం దేవుడికి ఉద్దేశం లేని క్రీడ. క్రీడకు ఎలాంటి ఉద్దేశం ఉండక్కరలేదు – ఇలా అని వేదాలు చెబుతాయి. పక్షపాత వైఖరి గాని, లేక కఠినత్వాన్ని గాని దేవుడికి అంటగట్ట కూడదు. ఎంచేతనంటే దేవుడు ప్రపంచాన్ని సృష్టిస్తున్నపుడు, వేరే కారణాలను దృష్టిలో ఉంచుకుంటాడు. ఏమిటా కారణాలు? పుట్టబోయే జీవుల పాప పుణ్యాలు! భగవంతుడిని వానతో పోలుద్దాము. వర్షం అన్నిటికీ (ప్రపంచం ఎలా ఉందొ అలా ఉండడం విషయంలో) ఒకే లాంటిది – వరి, బార్లీ మొదలయిన గింజలకు. వాటి లక్షణాన్ని, శక్తిని బట్టీ అవి మొలిచి వాటి వాటి లక్షణాలకు అనుగుణంగా ఫలిస్తాయి. అంటే ఎవరి కర్మానుసారం వాళ్లకు ఫలితాలు లభిస్తాయన్నమాట. కారణం కార్యానికి దారితీస్తుంది. ఈ సందర్భంలో ఒక ప్రశ్న ఉదయిస్తుంది – ఏ కారణం సృష్టి ఆదిలో ఉండి ఉండదు కదా అని. కానీ, జన్మ అనాది; అంటే ఆది లేనిది. అది అనాది అని ఎలా తెలుస్తుంది? ఏ కళంకం అంటని స్థితి అంటూ ఉండివుంటే అది తిరిగి పుడుతూ ఉండడమే జరగదు కదా. అది మళ్ళీ పుట్టడమే పునర్జన్మకు ఆరంభం లేదు అనడానికి రుజువు. సృష్టికి ఆది లేదు కదా. సృష్టిలోనే పునర్జన్మ ముడిపడి ఉంది. జీవి అంటే ఎప్పుడూ జీవించి ఉండేది అని అర్థం. మరణంతో అది అంతం కాదు. వేదం ప్రకారం సృష్టి కార్యం పదే పదే జరుగుతుంటుంది – అంచేత వలయానికి ఆది, అంతం ఉండవు.

"సోక్రటీసు మాటలను గుర్తు చేసుకుంటా. 'నిష్క్రమించవలసిన సమయం ఆసన్నమయింది, నేను మరణాభిముఖంగా, మీరు జీవితాన్ని కొనసాగించే దిశగా. ఈ రెండింటిలో ఏది మంచిదో దేవుడికే తెలియాలి.' సోక్రటీసు గురించి వెక్కి వెక్కి ఏడ్చిన వాళ్ళు అనేకులు. నా గురించి చెమరించే నయనం ఉండదు. నన్ను నేను సోక్రటీసుతో పోల్చుకున్నందుకు క్షమించండి. పోయేవాడిని చూసి ఏడిస్తే నేమి, నవ్వితే నేమి––వాడికి ఒరిగేదేమిటి?"

"నాకు ఆకలేస్తోంది, పోవాలి. ఆకలిని మించిన శత్రువు మనిషికి ఇంకెవరు? శరణాలయం అన్నావు; అనాథ శరణాలయం అయ్యి ఉండాలి. నీకూ దానికీ ఏమిటి సంబంధం?"

"ఒక అనాథకు, అనాథశరణాలయానికీ ఉండే సంబంధమే. ధ్రువీకరణ గురించీ ఆ ప్రశ్న వేసుంటారు."

"ఎందుకు చేరావు అన్న ప్రశ్న వేయ దలచుకోలేదు. ఆ వివరాలు నీకు అభ్యంతరం లేకపోతే చెప్పేసుకోవచ్చు; నాకు పెద్దగా ఆసక్తి లేకపోయినా."

"అనుమతి ఇస్తున్నందుకు ధన్యుడిని. నా జీవితంలో కూడా ఆసక్తికరమైన అంశాలున్నాయని అన్నయ్య చెప్పకుండా ఒప్పుకుంటున్నట్టు లెక్క. నిజానికీ ప్రతి వ్యక్తి జీవితం మరో వ్యక్తికీ ఆసక్తి కలిగించేదే అని నా నమ్మకం. నా నమ్మకం నీ నమ్మకమూ కానక్కర్లా."

"అడుగడుక్కీ ఉపోద్ఘాతాలు అక్కర్లేదు. అసలు విషయంలోకి దిగితే మనకు సమయం కలిసొస్తుంది – నీకు కాకపోయినా, నాకు."

"జీవితం మిగతా అనాథ శిశువులకన్నా అధ్వాన్నంగా ఆరంభమయింది. శిశువుగా చెత్తకుండీ పక్కన దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తుండగా జనాలు గుమ్మిగూడారు. నా తల్లో తండ్రో ఇరువురూనో చంపడానికి చేతులురాక, కానీ భద్రంగా చెత్తకుండీ చెంత ఒదిలిపోయారు. ఆ తావును వారు ఎందుకు ఎంచుకున్నారో తెలియదు. ఏదో కారణం ఉండుండొచ్చు, లేకపోయి ఉండొచ్చు. నాకు చెందినంతవరకు ఆ కారణాలుఅనవసరమైనవి. నన్ను పీక్కుతినడానికి ఏ కుక్కా ఎందుకనో రాలేదు. పుట్టటమంటూ జరిగినతరువాత చెత్త కుండీ లాంటి జీవితాన్నైనా కొనసాగించడం మేలు అని వాళ్ళ ఆలోచన కావొచ్చు; లేదూ నన్ను చంపే ధైర్యం, తెగువా వాళ్లకు కొరవడి ఉండొచ్చు. వాళ్ళను చూసే అవకాశం నాకు కలగలేదు అన్న అనవసరమైన బాధ రెండు మూడు సార్లు కలగక పోలేదు; వాణ్ని చెత్తలా, మలమూత్రాల్లా  ఒదిలించుకున్నాం, ఏమైనాడో ఎలా ఎదుగుతున్నాడో అన్న బాధ లేకపోయినా ఆలోచన వాళ్లకు కలిగి ఉండాలి మానవ కుతూహలం కొలది. అలా కలిగినా కలగక పోయినా నాకు లాభ నష్టాలు లేవు. నిజానికి నేను వాళ్లకు అక్కరలేనపుడు – లేక అడ్డుగా పరిణమించినపుడు, వాళ్లుమాత్రం నాకు ఎందుకూ? వాళ్ళు ఎవరూ అన్న ఆసక్తి నాలో అంతరాంతరాల్లో మిగిలి చావక తప్పదు. వాళ్ళు నన్ను ఒదిలించుకున్నట్టు నన్ను నేను ఒదిలించుకుంటున్నా. మూడేళ్లకే నాకు ఊహ తెలిసింది. అప్పటినుంచి నేను సహచరులతో కలిసి జీవిస్తున్నా. గాడిదైనా దాని చిన్నపుడు కాస్తో కూస్తో ముద్దొస్తుంది; కాకీ అంతే. మూడేళ్ళ వయసులో కూడా నా బుగ్గలు ఎవరూ చిదమలేదు; పెదవులు వాటికి తాకించి ఎంగిలి చెయ్యలేదు. పిల్లలు తమను ముద్దు చెయ్యాలని కోరుకుంటారనుకుంటాను; కానీ నేను అనుకోలేదు. నన్ను ఎవరో అనాథ శరణాలయానికి చేర్చారు; వాళ్ళు కాదని అనలేదు; దాని ఉనికే అనాథలను చేర్చుకోడానికి కాబట్టి. అలా రక్షించిన వాళ్లకు వారి దయను చాటుకోడానికి, ఒక మంచి కార్యం చేసామన్న ఆత్మా సంతృప్తి కలగడాని ఆ శిశువు ఒక అవకాశమిచ్చింది.  దానం చేసే అవకాశాలు లేకపోతే దాతలు దాతలు కాలేరు.

"పోతే, మోసం, కామం, నిర్దయ కారణాలుగా పుట్టిన ఈ జీవిని చూసి గర్వపడటానికి తల్లిదండ్రులకు ఏ కారణమూ లేదు. ఈ లోకం  ఆశ్చర్యపరిచే గుణం కలిగినదే నేమో; నా చూపులోని లోపం వలన మీకు అనిపించినట్టు నాకు అనిపించడం లేదు. ఈ సృష్టితో సహా నా కన్ను చూడలేనిది, నా చెవి వినలేనిది ఏదీ లేదు అనే మూర్ఖత్వం నాలో లేదు, అన్నయ్యా! ఆశ్చర్యకరంగా భావించడానికి కొంతమేరకు జ్ఞానం అవసరం. సంపూర్ణ జ్ఞానం ఆశ్చర్యపరచదు; మూర్ఖత్వం, అంగలోపాలూ ఆశ్చర్యపరచనట్టీ. ఈ లోకంలో పుట్టటమే ఒక వరంగా శిశువు భావించలేదు. శాపంలో ఏదో ఒక వరం లీలాగా ఉండకపోదు.  ఆరంభంలో చెప్పిన నాలుగు పాప గుణాలు చిత్రించిన, నిర్మించిన రూపం ఇది. దీనిని నేను ఎలా ప్రేమించగలనూ? 'నేను' అంటే నాకు తెలియదు – మనసో, ఆత్మో, మరొకటో. వాటన్నికీ మనమే పేర్లు పెట్టాము. తనను తాను తెలుసుకోవడం అంటే ఇది కాదు అని అనుకోగలమా? లౌకిక కక్ష్యను దాటి వెళ్లి చాందోగ్యలో చెప్పినట్టు 'తత్వమసి, శ్వేతకేతో'  అనుకోవడం అల్ప మానవుడినైన నాకు సాధ్యం కావడం లేదు. మోసం, కామం, దుర్మార్గాల బిడ్డగా వాటిని మిథ్యగా ఎలా భరించాలో నాకు తెలిస్తే అలా భావించగలిగితే నేను ధన్యుడినని తప్పక

భావిస్తాను. పంచేంద్రియాలలో దేనికీ చిక్కని దాన్ని ఆత్మఅనుకునే దాన్ని బ్రహ్మ అనుకునేదాన్ని సత్యంగా ఎలా భావించాలి? సృష్టిలో అణువుకే అణువైనదాన్ని, అన్నిటికన్నా పెద్దదైనది అనుకున్నదాన్నియు దేనితోనూ చూడలేము. నా అంతట నేను చూడలేను; మరొకరు చూపలేరు; సృష్టి కర్త చూపదు. అలా చూపించడానికి ఏవో అర్హతలు కావాలి, చేయలేని కృషీ కావాలి. అదేమిటో 'ఇదీ' అని నాకు తెలియదు. సాధన కావాలేమో. చేయడానికి అశక్తుడిని; ఆసక్తీ లేదు. సరైన బుద్ధిని మానవుడికి ప్రసాదించలేదు."

ఇద్దరూ కలిసినదగ్గరనుంచీ ఏదో ప్రాణప్రదమైన వస్తువులా దాచుకుంటూ, చేత్తో అప్పుడప్పుడు తముడు కుంటూ వస్తున్నాడు ఆ వ్యక్తి ఒక చిన్న పొట్లాన్ని. దాన్ని అతను చూసే చూపులోనూ ఇష్టత కనిపిస్తూ ఒచ్చింది. ఖరీదైన వస్తువై ఉండుంటుంది. ఇంటి దగ్గిర ఒదిలెయ్యలేక, ఒక వేళ అతను పోవడం నిజమే అయి ఉంటే – చనిపోయే వెళ ఎవ్వరికీ ఇవ్వడానికి మనస్కరించక, తెచ్చుకుని చూస్తూ అంగలారుస్తున్నాడేమో. అడగాలనిపించినా అతని గురించే గాని, అతని వస్తువుగురించేగాని ఆసక్తిని కనపరచడానికి అహంభావం అడ్డొచ్చి అనంతం అడగలేదు. అనంతం దాని గురించి అడగాలని అతను ఎదురుచూస్తున్నాడేమో. అతని చర్యలకుగల ఒక కారణంగా. రెండవ వాడికి చూపుకోవాలి, చెప్పుకోవాలి ఏదైనా వస్తువును గురించి గాని, విషయాన్ని గురించి అన్నది మానవ దుగ్ధలలో అది సాధారణమయినది, ముఖ్యమైన ఒకటి. అది అతని ఉద్దేశమయివుంటే దానికి దారి తీసే అవకాశాన్ని అనంతం తన ప్రస్తావన ద్వారా ఎందుకివ్వాలి? అవతలి వాడికి ఏమాత్రం సంతోషం కలిగించే విషయానికి ఇక పూనుకోదలచుకోలేదు గుణాంతరం చెందిన అనంతం.

"ఇంత అపురూపంగా చూసుకుంటున్నట్టు కనిపిస్తున్న ఈ వస్తువేంటా అని తెలుసుకోడానికి మీలో కుతూహలపు కదలిక కలగలేదా?"

"లేదు."

"నీలో మానవాతీతతత్త్వమో శక్తో ఉండుండాలి."

"అంత చిన్న విషయాన్నైనా పట్టించుకోకుండా ఉండగలగడం అంతటి మానవాతీత శక్తా?"

"పోనీలే, అన్నయ్యా, తప్పు మాట్లాడాను. నన్ను సంతృప్తిపరచడానికైనా అడిగి ఆ ఉపకారం చేసే ప్రయత్నం నీవు చేసుంటే బాగుండేదేమో."

"నేను అతి స్వల్పమైన మానవ కళ్యాణ సంబంధిత విషయానికి కూడా దూరంగా ఉండ దలచాను."

"నీవు అలాంటి దాన్ని అవతలి వ్యక్తినుంచి గూడా ఆశించవా?"

"ఆశిస్తాను. కానీ ఇదేమి వ్యాపారమా? నేను అవతలి వాడికి ఏమైనా చేస్తేనే నాకూ అలాంటిది వాడు చేయాలనుకోవడం?" పెడసరంగా అన్నాడు అనంతం.

"వ్యాపారం కాదుగాని, స్వార్థం."

"అంత చిన్న విషయంలోకూడా అది ఉండరాదా?"

"పెద్దదాంట్లో ఏలాగూ తప్పించుకోవడం సాధ్యపడదు, మహామహా వాళ్లకు తప్ప; చిన్న విషయంలోనైనా నిస్వార్థంగా ఉందామనుకో వచ్చుగా?"

"ఎందుకనుకోవాలి? చిన్న విషయాల ద్వారానైనా పుణ్యం ఆర్జించడానికా?"

అతనిలో అనంతానికి అలసట కనిపిస్తోంది. ఊపిరి వేగంగా  పీల్చుకుంటున్నాడు; ఆ పీల్చుకునే విధానం ప్రాణ వాయువు కొద్ది క్షణాలలో అంతరించిపోబోతున్నట్టుంది. అతను మాట్లాడక పోవడం చూసి అంతటితో ఆ విషయానికి విరామం అతను పెట్ట దలచుకున్నా, తాను పెట్టనీయ దలచుకున్నట్టు అన్నాడు పరిహసిస్తూ.

"చావబుతున్నా అని చెప్పుకోవడమూ ప్రగల్భమే అని తమ ద్వారా అనుకుంటున్నా. చచ్చేవాడికి ప్రగల్భమేమిటండి? చావబోవడం లేదు కాబట్టి ఒక అబద్ధాన్ని ఆశ్రయిస్తూ ప్రగల్భము ద్వారా ఏదో సంతృప్తిని పొందదలచుకున్నావేమో, ఎవరికి తెలుసు?"

"చూడండీ ఇదేదో బ్రహ్మ పదార్థం కాదు; విషమంతకంటే కాదు. ఆకలితో చావకుండా బతికించే తిండి."

"ఆకలితో చస్తే కాగల కార్యం గంధర్వుడే తీర్చినట్టు కదా, ఆకలిని తరిమి జీవించే ప్రయత్నం ఎందుకూ?"

"నాకు జంతికలంటే ఇష్టం; చాలా ఇష్టం – ఈ లోకంకన్నా. ఇది నేను తీర్చుకోబోతున్న నా ఆఖరి కోర్కె. నా చావు ముందు నీ ఆఖరి కోర్కె ఏమిటో అడిగి దాన్ని ఎవరన్నా తీర్చే ప్రయత్నం చేసే అవకాశం లేదుకదా?"

"అయితే మాటలు కట్టిబెట్టి తినేయ్యి."

"మీరొకటి తీసుకో కూడదు?"

"జంతికంటే నాకు అసహ్యం."

"నేను దీన్ని ఇష్టపడుతున్నానన్న విషయం తెలిసిన మరుక్షణం మీకు అది కలిగి ఉంటుంది."

"కావచ్చు!" అన్నాడు అనంతం.

మనిషి కాఠిన్యతకు అవధులు లేవు అనుకున్నాడతను.

కాఠిన్యంగా లేకపోతె తనకు కావలసినదాన్ని కోల్పోతాడా? కోల్పోకపోయినా కాఠిన్యత వహించడంతో ఆనందం, గర్వం దక్కుతాయా? సాటి మనిషంటే ఏహ్యభావం కాఠిన్యతకు దారి తీయవచ్చు. తనకు ఎవరన్నా ఏహ్యభావం కలగదు ఎందుచేతో. ఏహ్యభావాన్ని కలిగించే మూర్తిత్వాన్ని తాను కలిగి ఉండటం చేతనేమో. నిజంగానే తాను మానవాతీత వ్యక్తి. మనుషులకు తాను తగడు. మనుషులు తనకూ వేరే విధంగా తగరా? రెండవది నిజం కాదనిపిస్తోంది. వాళ్లకు తాను తగడు అని వెళ్ళిపోతున్నాననుకోవడం కూడా తన తిరుగుబాటుకు మరో కారణాన్ని జోడించడం కావచ్చు.

“చాలా త్వరగా కావించావే జంతికలు; నమలకుండా మింగేశావు. గొంతుకు గుచ్చుకోలేదేమో."

అతను అంగిటి దాకా కనిపించేట్టు నోరు తెరిచాడు; సొరంగ ద్వారం తెరిచినట్టు. పళ్ళు చాలా వరకు పుచ్చిపోయాయి. తినేసిన పదార్థం వాటికి అంటుకుని వుంది.

"నమలలేకే. నమిలే పని కడుపు చూసుకుంటుంది. నములుతూ కూర్చుంటే కాలహరణమూనూ."

"అది మింగే సమయంలో నీ మొహాన్ని అదోలా పెట్టావేమి? నీ ఆలోచనలు నిరంతర స్రవంతి."

"మీ గురించే ఆలోచించా."

"ఏమని?"

"మీకు ఎలాగూ చిన్న చిన్న విషయాలపై ఆసక్తి ఉండదు కదా; ఎందుకు చెప్పాలి? పైగా అది చెప్పడం వలన మీ ఉత్సుకత తీరవచ్చుగాని ఆ విషయం నిన్ను బాధించుతుంది. బతకడం ద్వారా చాలా మందిని నా ప్రమేయం లేకుండానే బాధించా. చనిపోబోతూ మరికొంత మందిని ఎందుకూ బాధించడం? మరో జన్మ ఉందేమో! కర్మ ఉందేమో! ఆ విషయాల మాట అటు ఉంచీ బాధించడం, బాధించకపోవడం, అన్నింటికన్నా ముందు నా ఇష్టం లేక అనిష్టం మీద ఆధారపడుంది."

" నీవు చెప్పిన అన్ని కారణాలు పక్కకు తోసెయ్యి; నన్ను బాధించే అంశం నాకు సంబంధించీ నీలో ఏదో చెడు అభిప్రాయం ఉండటంవల్ల కదా? నా తప్పేమిటి అలాంటి చెడు అభిప్రాయం కలగడానికి?"

"అదేదో తెలుసుకుని మా అన్నయ్య బాధపడటం కన్నా, ఆ చెడు అభిప్రాయం తెలుసుకోలేదు అని పడే బాధ తక్కువది."

"చస్తూ కూడా కాస్తో కూస్తో నన్ను బాధపెట్టే పోతావన్నవిషయం గ్రహించు."

"దేని గురించైనా అసలు ఆలోచనే కలగకుండా తనను తాను నియంత్రించుకోగల పూర్తి శక్తిని మనసు పొందలేదు."

"మరణాలూ లోక కళ్యాణార్థము అని నేను తెలుసుకున్నా."

"ముఖ్యంగా నాలాంటి వాళ్ళ మరణం. సరే నిజం చెబుతున్నా. మీ గురించీ నాలో మిమ్మల్ని బాధించే చెడు భావం లేదు. నీలో ఏమి లేకపోయినా మీ ఆసక్తిని రగిలించాలనిపించింది. విజయవంతం అయ్యా."

"నీలో 'నేను బాగా ఆలోచించగలను' అనుకునే తెలివి తక్కువ తనం కూడా ఉంది. ఏ ఆసక్తి లేకుండా నీ గోడు విన్నానా?"

"నా పేరు దేవుడు."

"ఐతే ఏంటట?"

"ఏమీ లేదు. ఇందాక అడిగారని చెప్పా."

వెళ్లిపోవాలంటే దేవుడికి కొంచం దిగులు వేస్తోంది, అపరిమితమైన ఆనందంతో బాటు. ఆ ఆనందాన్ని మరికొంతసేపు కొనసాగించాలనిపిస్తోంది. అది స్వేచ్ఛ ఇవ్వబోతున్న ఆనందం; టన్ను బరువు మోసి కిందకు దించుకొనేటప్పటి ఆనందం. ఇంతవరకూ నివసిస్తూ వచ్చిన భూమి, తన శరీరాన్ని ప్రేమగా స్పృశిస్తూ వచ్చిన గాలీ, మనసుకు హాయినిస్తూ వచ్చిన ప్రకృతీ, వెచ్చదనాన్నిచ్చిన సూర్యుడు, వెన్నెలనిచ్చిన చంద్రుడు, ఆలోచింప చేసే చీకటి, మిథ్యాలాంటి అందమైన ఆకాశం, మిథ్యను అలంకరించినట్టున్న చుక్కలు – వీటన్నిటినీ ఒదిలిపోవడం అంత తేలికైన పనా? అదృశ్యంగా, తాను రాకుండా చావు ఎదో మనసుకు వీడ్కోలు చెబుతోంది. వీడుకోలు పదంలో, భావంలో, బాధించే గుణం ఉంది, ప్రేమా ఉంది. ఒక చీడను లేక పీడను తాను ఒదిలించుకుంటున్నానన్న బలమైన భావన కలిగితే సంపూర్ణమైన సంతోషం కలుగుతుంది. బాధించేది, సుఖపెట్టేది భావమే కదా. ఏదైనా నిజాయతీ ఐన భావం కలగడం అనుకున్నంత తేలికా? దేనికైనా ప్రేరణ కావాలి. గ్రామాంతరం వెళుతూ ఏదైనా సత్రంలో ఒక రాత్రి బస చేయడమే జీవితం అన్నాడు జాబాలి. ఏ అనుబంధమైనా ఉన్మాదంతో సమమట; చివరకు తల్లి దండ్రులతోటిది కూడానట. వాళ్లిద్దరూ నిమిత్త మాత్రులేనట. శుక్రశోణితాలు ఋతుమతి అయిన స్త్రీ గర్భంలో కలియడం పుట్టుకకు దారి తీస్తుంది. తాత్పర్యం ఏమిటయ్యా అంటే జీవితాన్ని తేలిగ్గా తీసుకోవడం, లేక దాన్ని పట్టించుకుని ఏడుస్తుండటం కాదు. కానీ కావాలని పట్టించుకుని ఏడుస్తామా? అదే మనల్ని పట్టి పీడిస్తుంది. శక్తి ఉన్నవాడు భరిస్తాడు. తనకు సంబంధించినంతవరకు తాను పట్టించుకో దలచుకో లేదు గనుక నిష్క్రమిస్తున్నాడా దేముడు? తాను నిష్క్రమించ దలచుకున్న నిర్ణయాన్ని బలంగా తీసుకుంటే ఆపగల శక్తి లేదు. జీవితం ఒక స్వప్నం, మాయామయం, భ్రమయమానం, మహాంధకారం, ఇంద్రజాలం, మిథ్యాదర్శనం – తాను నిష్క్రమించడమూ దానిలో భాగమే నేమో.

ఈ ప్రాంతంలో మూడు దేవాలయాలున్నాయి; వాళ్ళు కూర్చుని ముచ్చటించుకుంటున్న రోస్ అనే ఆంగ్లేయ న్యాయమూర్తి పేరు పెట్టిన కొండ మీద కట్టిన కాథలిక్ చర్చితో సహా. దానిని ఆనుకుని ఉన్న రెండు ఇతర కొండల మీద మజీదు, వేంకటేశ్వరుడి దేవాలయం ఉన్నాయి.

"ఈ ప్రదేశాన్ని నా నిష్క్రమణ వేదికగా చేసుకోవడంలో ఇక్కడ మూడు మతాల దేవుళ్ళు నెలకొని ఉండటం ఓ కారణం అయితే, కాండ మీది నుంచి దూకి చావడానికి భగవంతుడు ఏర్పరచిన సదుపాయం కూడా మరొక కారణం."

"ముగ్గురు దేవుళ్లలో ఎవరో ఒకరు నిన్ను ఈ దుర్మార్గపు లోకనుంచి పుణ్యలోకానికి తీసుకుపోయే అవకాశం కూడ ఉంది. దీన్నీ ఒక కారణంగా భావించు."

"ఆశలేదు; ఈ జన్మలో."

"అనంతం దేవుడికి దగ్గిరగా జరిగాడు అసంకల్పితంగా. అల్లా తాను జరిగినట్టు తానే గమనించలేదు. దక్షిణాభిముఖంగా వాళ్లిద్దరూ కూర్చుని ఉన్నారు. యారాడకొండ, దానిపై ఆకాశం కనిపిస్తున్నాయి. కనిపిస్తున్న ఆకాశం మీద చుక్కలు మేల్కొంటున్నాయి. అవి రక్తహీనంగా ఉన్నాయి. చీకటికై ఎదురు చూస్తున్నాయి చకోరాలలా. వాటిది తీరే

కోర్కె. సముద్రం మీది నుంచి పడమటికి, ఉత్తరం వైపుకు త్రవ్విన కాలువలో అప్పుడప్పుడూ వెలుగుతున్న విద్యుద్దీపాల ప్రతిబింబాలు వరుసగా కనిపిస్తున్నాయి. చర్చిలో గంట మ్రోగుతోంది. నిదురించే దేవతను మేల్కొలపడానికి. వెనక్కు తిరిగి చూశాడు అనంతం. లావెండర్ కాలువ అని ముద్దుగా పిలుచుకునే పాత పట్నం మురికి కాలువ వాసనను మినహాయిస్తే మామూలు నీటి కాలువ విద్యుత్ దీప అలంకరణగా మురిపెంగా, వయ్యారంగా, వంపులు తిరిగిపోతూ రెచ్చకొడుతుంది. దాని ఆరంభంలో జెట్టీకి మరపడవలు కట్టేసి ఉన్నాయి. డీజిల్ వగైరా నూనెల కంపు,మొరికి కంపుతో మిళితమై ఉన్నా వాళ్ళు కూర్చుని ఉన్నచోటు దాకా చేరడం లేదు, దానికై అది గీయని సరిహద్దును ఏర్పరచుకున్నట్టు. ఆ కాలువకూ, వాళ్లిద్దరూ కూర్చుని ఉన్న కొండకూ ఆట్టే ఖాళీ లేదు.

"అన్నయ్యా, గోడ చివర దాకా కూర్చోకు, నిండుగా నూరేళ్లూ బ్రతక వలసిన వాడివి."

"చావబోతూ కూడా మంచిదనాన్ని ఎందుకు ప్రదర్శిస్తున్నావు?"

"మంచి, చెడులు సహజ మానవస్వభావాలే కదా. చచ్చే దాకా ఆ రెండు జంట పాముల్లా మెలివేసుకుని జీవిస్తాయి – విడదీయలేము. మంచినీ పాముతోనే పోల్చాను; అది తప్పేమో. కానీ ఒకటి కాటేసే కోరలున్న పాము, రెండోది కోరలు లేనిదీ; కాటేసే ప్రయత్నం చేయనిది అనేసుకుంటే కొంతైనా తప్పు కాకుండా ఉండదు. నా ఆలోచనలో – చావు ముందుకొస్తుండటం వలననేమో – స్పష్టత కరవవుతోంది; ఎదో మైకం ఎవరో పంపినట్లు, నన్ను తొందరపెడుతున్నట్టు కమ్ముకుంటోంది, అన్నయ్యా..."

"ఆకాశానికి ఎక్కుపెట్టినట్లున్నాయి యంత్రాలు," అన్నాడు అసంబద్ధంగా అనంతం; థ్రిల్లింగ్గా ఉంది అతనికి క్రమేపీ, కాస్త భయమూ కలుగుతునన్నా.

"అవును. అవన్నీ సంపదే. సంపద సంపదను సృష్టిస్తుంది...." దేవుడు అన్నాడు.

అతని మాటలలో మైకం అధికంగా ధ్వనించడంతో అనంతం అతని ముఖంలోకి భయ భయంగా చూశాడు. ఒణుకు పుట్టింది. పరిగెత్తి పారిపోవాలని ఉంది. ఎదురు చూసిన భయంకరమైన క్షణం ముంగిలిన నిలిచింది.

దేవుడు ఉన్నట్టుండి మృగంలా కేక వేశాడు. అది నిశీధిలోకి దీనంగాను, భయంకరంగాను, మందలిస్తున్నట్టుగాను దూసుకు పోయింది. అనంతం వణికే కాళ్ళ మీద నిలబడగలిగాడు. కొండ మీద వాళ్లిద్దరూ తప్ప మరో మానవ జీవి లేదు. ఆకాశం నిండా ఒక దాని మీదికి మరొకటి భయంతో ఎక్కినట్టు చుక్కలు. కొండ దిగువున మానవుల గుంపు, కలిసి, కలియకుండా; పశువుల మందలా. పశువుకూ ఒంటరితనం భయాన్నిస్తుంది. మంద ధైర్యం ఇస్తుంది. అనంతం ప్రాణ భయాన్ని అనుభవిస్తున్నాడు. అలాంటి వ్యక్తిని చూస్తూ, అసహ్యించుకుని గాని భయపడిగాని దూరంగా జరిగిపోకుండా ఇంతసేపూ కాలక్షేపం చేయడం మూర్ఖత్వమని పూర్తిగా తేటతెల్లమయింది. అతనిలాంటి ముఖాన్ని అనంతం తన జీవితంలో చూడటం ఇదే మొదటిసారి. దేవుడు, పిశాచం, మనిషి అతనిలో గోచరిస్తున్నారా కలగలుపై? ఏ చిత్రకారుడు దాన్ని సృష్టించగలడు? అనంతానికి జాలి తప్ప మిగతా భావాలు కలిగాయి మనసులో. దేవుడి నోటి వెంట నురగ

కారుతోంది. అతనికి మూర్ఛ జబ్బుందని గ్రహించాడు. దేవుడంటూ ఉంటే దేవుడే కాక, దేవుడి ప్రత్యర్థి కూడా సృష్టికి పాల్పడతాడని, అక్కడ పురుగులా కొట్టుకుంటున్న, అసహ్యాన్ని కలిగిస్తున్న జీవిని చూసి అనిపించింది. మూర్ఛ రోగికి ఇనుప సాధనం చేతికిస్తారని తెలుసు. కానీ ఏదీ అందుబాటులో లేదు. నీళ్లు కుమ్మరిస్తారనీ తెలుసు. అదీ అందుబాటులో లేదు. అతను తన్నుకుని, గింజుకుని పిట్టగోడ అవతలి చివరకు చేరుతున్నాడు. మరికొన్ని క్షణాలలో అతనికి ఏం జరగబోతోందో అర్థమైయింది అనంతానికి. అక్కడి నుంచి జారి, కొండ మీది నుంచి దొర్లి భూమిని చేరుతాడు. అప్పుడు దేవుడి కోర్కె సిద్ధిస్తుంది. చావబోతున్న, జుగుప్స కలిగించే ఆ జీవి మీద తాను చేయివేసి ఇవతలకు లాగి పడేయాలని అనిపించలేదు. అక్కడే నిలబడి మీమాంస వలలో చిక్కుకుని మథన పడదలుచుకోలేదు అనంతం. ఆలా తన చేతికి, మనసుకు, ఏదీ అంటుకో (తాత్కాలికంగా కానీ, శాశ్వతంగా కానీ) కూడదనుకుంటే అక్కడి నుంచి పారిపోవడం ఉత్తమమనిపించి, ఆ పని చేశాడు అనంతం.

రూసో అన్నట్లు ఎప్పటికైనా చావల్సున్నప్పుడు భూకంపంలో జనం చచ్చారని రాద్ధాంతం ఎందుకు చెయ్యటం? తత్త్వవేత్తలు  నిజంగానే వాళ్ళ ఆలోచన ద్వారా మనకు ఊరట ఇస్తారు. చనిపోవాలన్న ధృడ నిశ్చయానికి వచ్చి ఉన్నాడు. ఇప్పుడు తను ఆపి తన ఇంటికి వెళ్ళిపోయినా తరవాత వాడు చావకుండా ఎవడాపగలడు? దేవుడు వాడికి చావే మంచిదన్న నిర్ణయానికి వచ్చున్నాడు. ఆ దేవుడంటూ ఉంటె ఈ దేవుడికి చావే వాడి బ్రతుకు రోగానికి శాశ్వత పరిష్కారం అని దాన్ని ప్రసాదించాడేమో, నాకేమి తెలుసు అనుకున్నాడు అనంతం.  వాడు తనకు ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకునే మేధా సంపత్తుంది, హక్కుంది. నేనెవరిని గొట్టంగాడిని? ఏది, ఎలా, ఎప్పుడు, ఎందుకు జరగాలో అలా జరిగి తీరుతుంది.

దేవుడి ముఖంలో ఏదో దివ్యానందం చూశాననిపించింది. భ్రమా, నిజామా? నిజమేనేమో. దోస్తోయివెస్కీ మూర్ఛ రోగంతో జీవితాంతం జీవించాడు. కానీ దాన్ని ఒక వరంగా కూడా భావించినట్లున్నాడు. పదే, పదే రచనలలో ఆ రోగానుభవాన్ని ప్రస్తావిస్తూ వచ్చాడు. సెల్ఫ్ పిటీ కూడా కావొచ్చు, మూర్ఛ రాబోతున్న క్షణాల గురించి మనిషి తన మిగిలిన జీవితాన్ని అంతా మూల్యంగా చెల్లించవచ్చన్నాడు. ఈ క్షణం మనిషి యావత్ ఉనికికే ఇచ్చిన కానుకగా భావించనట్టు. ఆ దివ్యానందం మానవ మామూలు పరిస్థితిల్లో పొందలేము అంటాడు.

మరణించిన వాడితో వీలైవుంటే చెప్పుండే వాడు:  రూసో మాటలు నిజమని, అపకారాన్ని పూర్తిగా తొలగించ లేక పోవచ్చు గానీ, దాన్ని సాధ్యమైన తక్కువగా ఉండేలా దేవుడు నిజంగానే చూస్తాడని; చావటానికి ఎక్కువగా కష్ట పడకుండా మూర్ఛను రప్పించి, ఈ ఒడ్డు విడిచి పోతున్నట్లు కూడా తెలీకుండా అవతలి ఒడ్డుకి చేర్చానని. మూర్ఛ రోగం లేకపోతే మేధావులకే మేధావైన దోస్తోయివెస్కీ మస్తిష్కం మానవాళికి దక్కేది కాదేమో!

ఉన్నట్లుండి అనంతానికి ఒక విషయం తోచింది. మృతుడు, తాను సైమీస్ పిల్లలని. లోకం మీద ఇద్దరు తిరుగుబాటు చేసారు. విధానం, ఎంచుకున్న మార్గాలు వేరువేరు. వాడికి ఆ విషయం తెలీకుండానే 'అన్నయ్యా' అంటూ నోరారా పిలిచాడు.

అసలు దేవుడుతో పనేమిటి – ఒక వేళ దేవుడే నిర్ణయించి ఉన్నా, నిర్ణయించి ఉండకపోయినా – జీవించడానికి? చావు వచ్చేదాకా బ్రతుకు అనేగా పుట్టుక ఇచ్చింది. పుట్టుక, చావు రెండూ బిందువులనుకుంటే ఒక దాన్ని, మరొక దాన్ని కలుపుతూ గీచేది రేఖ. అదీ వొంకరటింకరగా ఉండొచ్చు, సరళమైన రూపాన్ని కలిగి ఉండొచ్చు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS